నమస్తే తెలంగాణ

# జగిత్యాల

5 | కరీంనగర్, బుధవారం 4 జూన్ 2025 | JAGTIAL

కలెక్టరేట్‌కు వచ్చిన మహిళలు

## మా పేర్లెందుకు తొలగించిన్రు

- ఇందిరమ్మ ఇండ్లిప్పిచ్చి న్యాయం చేయండి
- పుట్నూర్ మహిళలు
- పెద్దపల్లి కలెక్టరేట్‌కు రాక
- కలెక్టర్‌కు వినతి



పెద్దపల్లి, జూన్ 3(నమస్తే తెలంగాణ): 'మేమేం పాపం చేసినం. మా పేర్లు ఇందిరమ్మ ఇండ్ల జాబితా నుంచి ఎందుకు తొలగించిన్రు. మొన్నటి దాకా లిస్టులో పేరున్నదని చెప్పిన్రు. మంజూరు పత్రాలు కూడా ఇచ్చిన్రు. ఇప్పుడెందుకు జాబితాల్లోంచి తీసేసిన్రు' అంటూ పాలకుర్తి మండలం పుట్నూరు గ్రామానికి చెందిన తొమ్మిది కుటుంబాలకు చెందిన మహిళలు ఆవేదన చెందారు. ఈ మేరకు మంగళవారం పెద్దపల్లి కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆ మహిళలు మాట్లాడుతూ, గ్రామానికి చెందిన కొంత మంది కాంగ్రెస్ నాయకులు తమ పేర్లను తొలగించారని, తమలాంటి పేద కుటుంబాలకు అన్యాయం చేయడం తగదని వాపోయారు. కలెక్టర్ చొరవ చూపి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. వారి నుంచి వినతిపత్రం స్వీకరించిన కలెక్టర్ స్థానిక అధికారులకు సమాచారం పంపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

### కలెక్టరే న్యాయం చేయాలె

మా ఊరిలో అసలు పేదోళ్లం అంటే మేమే. మాలాంటోళ్ల పేర్లను ఇందిరమ్మ ఇండ్ల జాబితాల నుంచి తీసెయ్యడం అన్యాయం. మాకు జిల్లా కలెక్టరే న్యాయం చేయాలె. మాకు మళ్లీ జాబితాలో పేరు పెట్టించి ఇల్లు ఇప్పించాలె.

**- గుంజ రజిత, పుట్నూరు**



కరీంనగర్‌లోని ముకరంపురలో రేషన్ దుకాణం ఎదుట బారులు తీరిన జనం

## రేషన్.. పరేషాన్

- దుకాణాల వద్ద లబ్ధిదారుల అవస్థలు
- గంటల తరబడి పడిగాపులు
- క్యూలైన్లలో సంచులు, పత్రాలు
- సర్వర్ ప్రాబ్లంతో చాలా మంది వెనక్కి

ఒకేసారి మూడు నెలల బియ్యం పంపిణీ చేస్తున్న ప్రభుత్వం అందుకు తగినట్లుగా ఏర్పాటు చేయకపోవడంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులు రేషన్ దుకాణాల వద్ద అవస్థలు పడుతున్నారు. సన్నం బియ్యం అందుతాయో లేవోనన్న ఆందోళనతో షాపుల వద్ద బారులు తీరి నిల్చుంటున్నారు. గంటల తరబడి లైన్లలో నిలబడలేక సంచులు, కార్డులు పెడుతూ వేచి చూస్తున్నారు. మరోవైపు సర్వర్‌లో తలెత్తిన లోపంతో రోజంతా పడిగాపులు కాస్తూ ఓపిక నశించి తిరిగి నిరాశతో ఇళ్లకు వెళ్తున్నారు. సర్వర్ వచ్చినా ఇంతకుముందు 24 కిలోలకు ఒకేసారి తంబ్‌వేయగా ప్రస్తుతం 20 కిలోలకు ఒకసారి నాలుగు కిలోలకు మరోసారి.. ఇలా మూడు నెలలకు సుమారు ఆరు సార్లు తంబ్ వేయాల్సి వస్తుంది. ఈ కారణంగా ఒక గంట సమయంలో కేవలం ఇద్దరి నుంచి ముగ్గురికి మాత్రమే ఈ బియ్యం పంపిణీ జరుగుతుంది. దీంతో ప్రజలు గంటల తరబడి లైన్‌లో వేచిచూడాల్సి వస్తున్నది.

**- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్**



వావిలాలపల్లిలో రేషన్‌దుకాణం ముందు లైన్‌లో పెట్టిన సంచులు



భాగ్యనగర్-మంకమ్మతోట చౌరస్తా వద్ద రేషన్ దుకాణం ముందు బారులు తీరిన జనం

## లడ్డూ ప్రసాదం చుట్టే వివాదం!



- ఏసీబీ ఆకస్మిక తనిఖీల్లో బట్టబయలైన అవినీతి వ్యవహారం
- ఏడుగురిపై చర్యలకు సిఫారసు
- చార్జి మెమోల జారీకి రంగం సిద్ధం



రాజన్న లడ్డూ ప్రసాదం (ఫైల్)

వేములవాడ, జూన్ 3: వేములవాడ రాజన్న భక్తులకు అత్యంత ప్రీతిపాత్రమైన లడ్డూకు సంబంధించిన వ్యవహారం ప్రస్తుతం వివాదంగా మారుతున్నది. సరుకుల కొనుగోలు, తయారీ, విక్రయాలపై వచ్చిన ఫిర్యాదులో భాగంగా ఏసీబీ గతేడాది ఆగస్టులో ఆకస్మికంగా తనిఖీలు చేయగా, అవినీతి బట్టబయలైంది. అయితే, సమగ్ర దర్యాప్తు చేసిన ఏసీబీ శాఖ ఈ యేడాది మార్చిలోనే రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను కూడా అందజేసింది. రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్ రాజన్న ఆలయంలో చోటు చేసుకున్న అవినీతి అక్రమాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా శాఖా పరమైన విచారణ జరిపి, తక్షణమే చర్యలు తీసుకోవాల్సిందిగా ఈ నెల 2న కమిషనర్ కార్యాలయాన్ని లేఖ ద్వారా ఆదేశించింది. ఇక ఈ వ్యవహారంలో ఏడుగురు ఉద్యోగులపై చర్యలకు దేవాదాయ శాఖ రంగం సిద్ధం చేసింది.

### బట్టబయలైన అవినీతి

రాజన్న లడ్డూ ప్రసాదం తయారీకి సంబంధించి మూడు విభాగాల్లో అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నట్టు ఇప్పటికే ఏసీబీ శాఖ నిర్ధారించింది. గోదాములోని 24 రకాల సరుకుల వ్యత్యాసాలను.. అందులో ప్రధానంగా కాజు 144 కిలోలు, కిస్మిస్ 88 కిలోలు, నెయ్యి 981 కిలోలు, బియ్యం 908 కిలోలు వీటితోపాటు మరో 13 రకాల సరుకుల నిల్వలు తేడాగా ఉన్నాయని సామాజిక మాధ్యమాల ద్వారానే వెల్లడించిన విషయం తెలిసిందే. గోదాం నిల్వల వ్యత్యాసంతోపాటు తయారీ, అమ్మకాలలోనూ అనేక వ్యత్యాసాలు, అవినీతి జరిగినట్టు ఏసీబీ తన నివేదికలో పేర్కొన్నట్టు తెలుస్తున్నది. మొత్తం ప్రసాదం తయారీ చుట్టే ఈ వివాదం ముడిపడి ఉన్నట్టు అధికారుల విచారణతో తెలుస్తున్నది.

### ఏడుగురిపై చర్యలు!

ఏసీబీ ఇచ్చిన నివేదిక ఆధారంగా రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్ ఏడుగురు ఉద్యోగులపై చర్యలు తీసుకునేందుకు సిఫారసు చేసింది. ఈ లేఖ ఈ నెల 2న కమిషనర్ కార్యాలయానికి చేరినట్లు తెలిసింది. అందులో ఏసీబీ అధికారుల తనిఖీల్లో విధుల్లో ఉన్న గోదాం పర్యవేక్షకుడు, గోదాంలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్, లడ్డూ ప్రసాదాల తయారీ విభాగం పర్యవేక్షకుడు, లడ్డూ ప్రసాదాల విక్రయశాలలో ఉన్న జూనియర్ అసిస్టెంట్, కల్యాణ కట్టలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు రికార్డ్ అసిస్టెంట్‌లపై శాఖా పరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో సదరు రాజన్న ఆలయ కార్యనిర్వహణ అధికారిగా ఉన్న అధికారితో కలిపి మొత్తం ఏడుగురిపై చర్యలు తీసుకునేందుకు దేవాదాయ శాఖ రంగం సిద్ధం చేస్తున్నది. అయితే, చార్జీ మెమోలు జారీ చేసి శాఖా పరమైన విచారణ జరపాల్సిందిగా కూడా ఆదేశించినట్లు తెలిసింది. దీంతో రాజన్న ఆలయ ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది.

## కరీంనగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో

# కొలువుల దందా?

- ఉద్యోగాల పేరిట ఓ అధికారి అడ్డదారి
- కొత్తగా మరో 36 ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలపై కన్ను
- గతంలో గోడౌన్లలో పని చేసిన వారికి ఆఫర్
- ఇప్పటికే ఇద్దరికి ఇచ్చిన ఉద్యోగాలపై కమిటీ విచారణ
- అయినా మారని సారు తీరు
- కళాశాల అధికారులు వ్యతిరేకించినా పట్టుబట్టి కలెక్టర్‌కు వినతి పత్రం?
- ఆయనకు అంత ఇంట్రెస్ట్ ఎందుకనే సంశయం



**వైద్య విద్యను నేర్పే కరీంనగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ కొలువుల దందాకు కేరాఫ్‌గా మారిపోతున్నదా..? అంటే అవుననే తెలుస్తున్నది! ఓ కీలక అధికారి తీరుతో కళాశాల ప్రతిష్ట రోజురోజుకూ మసకబారుతున్నది. అర్హులైన అభ్యర్థులను వదిలి తన కుటుంబ సభ్యులకే ఔట్ సోర్సింగ్ కింద ఇచ్చిన ఉద్యోగాలపై గత నెల 16న 'నమస్తే తెలంగాణ'లో ప్రచురించిన కథనంతో వ్యవహారం బయటపడింది. కలెక్టర్ పమేలా సత్పతి స్పందించి కమిటీని నియమించగా, ఓ వైపు విచారణ చేస్తుండగానే సదరు ఆఫీసర్ మరో దందాకు తెరలేపినట్లు తెలుస్తున్నది. కొత్తగా 36 మంది శానిటేషన్ సిబ్బందిని ఔట్ సోర్సింగ్ కింద నియమించేందుకు ఓ ఏజెన్సీతో ఒప్పందం జరుగగా, వాటిపై ఆ సారు కన్నుపడింది. మెడికల్ కళాశాల ఏర్పాటు చేసిన సీడ్ గోదాముల్లో గతంలో పనిచేసిన వారిని పిలిచి ఉద్యోగాలు ఇప్పిస్తానని ఆశ చూపి, ఏకంగా కలెక్టర్‌కు ఇచ్చేందుకు వినతి పత్రం ప్రిపేర్ చేసినట్లు తెలిసింది. ఈ విషయంలో తరుచూ జోక్యం చేసుకుంటున్న ఈ అధికారికి ఎందుకింత ఇంట్రెస్ట్ అనే సంశయం వ్యక్తమవుతున్నది.**

కరీంనగర్, జూన్ 3 (నమస్తే తెలంగాణ)/విద్యానగర్: కరీంనగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఉద్యోగాల దందా కొనసాగుతూనే ఉంది. ఈ కళాశాలలో పనిచేస్తున్న ఓ కీలక అధికారి అర్హులైన అభ్యర్థులను వదిలి తన కుటుంబ సభ్యులకే ఔట్ సోర్సింగ్ కింద ఉద్యోగాలు ఇప్పించుకున్న విషయాన్ని కొద్దిరోజుల కింద 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తెచ్చింది. గత నెల 16న 'మెడికల్ కళాశాలలో ఉద్యోగాల దందా' శీర్షికన ప్రముఖంగా ప్రచురితమైంది. ఈ విషయమై స్పందించిన కలెక్టర్ పమేలా సత్పతి, జిల్లా రెవెన్యూ అధికారి బీ వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే వెంకట రమణ, హాస్పిటల్ సర్వీసెస్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ఏ చంద్రశేఖర్, మెడికల్ కళాశాల అనస్తీషియా హెచ్‌వోడీ డాక్టర్ శాంతన్ కుమార్‌తో ఒక కమిటీని నియమించారు. ఈ కమిటీ ఇటీవల కళాశాలకు వెళ్లి విచారణ జరిపింది. ఓ అధికారి కుటుంబ సభ్యులు ఔట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగం చేస్తున్నట్లు ఈ కమిటీ దృష్టికి వచ్చింది. ఒక పక్క ఈ విచారణ జరుగుతుండగానే మరో పక్క 36 మందిని ఔట్ సోర్సింగ్ విధానంలో నియమించేందుకు ఈ అధికారి జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే తండ్రి స్థానంలో కొడుక్కు ఉద్యోగం ఇప్పించిన ఆ సారుకు, పెద్ద మొత్తంలోనే డబ్బులు ముట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అయితే ఇపుడు పెద్ద సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు ఏర్పడడంతో కొత్త దందాకు తెర తీసినట్లు తెలుస్తున్నది.

### ఆయనకు ఎందుకింత శ్రద్ధ?

కరీంనగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఓ కీలక పోస్టులో ఉన్న అధికారి ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకాల్లో ఎందుకింత శ్రద్ధ చూపుతున్నారనే చర్చ జరుగుతున్నది. కళాశాలపై అధికారులకు లేని ఆసక్తి ఈయనకు మాత్రమే ఎందుకని ఏకంగా కళాశాల ఉద్యోగులే చర్చించుకుంటున్నారు. గతంలో తన కుటుంబ సభ్యులకు ఔట్ సోర్సింగ్ కింద ఉద్యోగాలు ఇప్పించుకున్న ఈ అధికారి ఇదే బాటలో మరిన్ని ఉద్యోగాలు ఇప్పించాలని చూస్తున్నాడనే ఆరోపణలు వస్తున్నాయి. నిజానికి గతంలో తెలంగాణ విత్తనోత్పత్తి సంస్థకు చెందిన గోదాముల్లో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేశారు. ఈ కళాశాల ఏర్పాటుతో ఇందులో పని చేసిన హమాలీలకు ఉపాధి దెబ్బ తింటుందని భావించిన అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అర్హులైన వారికి ఔట్ సోర్సింగ్ కింద ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పింది. ప్రభుత్వం మారినా హమాలీలకు ఇచ్చిన మాట నిలబెట్టుకునే బాధ్యత ఇప్పటి ప్రభుత్వంపై ఉంటుంది.



హమాలీలు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులను సంప్రదించి తమకు ఇచ్చిన మాట నిలబెట్టుకునేలా ఒత్తిడి తెచ్చుకుంటే ఒక రకంగా ప్రయోజనం కలిగే అవకాశాలు ఉంటాయి. కానీ, మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న ఈ అధికారి వారిని ఏకంగా కళాశాలకు రప్పించుకుని అధికారికంగా కలెక్టర్‌కు ఓ వినతి పత్రాన్ని తయారు చేసినట్లు తెలుస్తున్నది. అందులో గతంలో సీడ్ గోదాముల్లో పని చేసిన వారితో సంతకాలు తీసుకుని కళాశాలలో పనిచేసే మరో అధికారి సంతకం తీసుకుని కళాశాల నుంచి అధికారికంగా కలెక్టర్‌కు లేఖ రాసే ప్రయత్నం చేసినట్లు, ఆయన ప్రతిపాదనను మిగతా అధికారులు తిరస్కరించినట్లు తెలిసింది. కానీ, ఆ అధికారి మాత్రం తన ప్రయత్నాన్ని మానుకోకుండా తాను ప్రిపేర్ చేసిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు చేర్చినట్లు కళాశాల ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. గతంలో ఇదే కళాశాలలో పని చేసిన ఓ కార్మికుని స్థానంలో తన కొడుక్కు ఉద్యోగం ఇప్పించడానికే పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇపుడు ఒకే సారి 36 ఉద్యోగాల నియామకం జరుగుతున్న నేపథ్యంలో ఈ అధికారి తిరిగి జోక్యం చేసుకొని జిల్లా అధికారులకు తలనొప్పి తెస్తున్నట్లు తెలుస్తున్నది. నిజానికి ఔట్ సోర్సింగ్ ఏజెన్సీతో కళాశాలకు ఒప్పందం జరుగుతుంది. సదరు ఏజెన్సీయే ఉద్యోగులను నియమించాల్సి ఉంటుంది. ఇపుడు కళాశాలలో పనిచేస్తున్న అధికారి జోక్యం చేసుకోవడం, గతంలో పనిచేసిన కార్మికులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరడం వెనక పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారే అవకాశాలు ఉన్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. ఇందుకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తున్న ఓ ప్రభుత్వ ఆమోదిత సంస్థ అధికారుల ప్రోత్సాహం కూడా ఉన్నట్లు, అందుకే సదరు కళాశాల అధికారి ఇంత ఉత్సాహాన్ని ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

### విచారణ కమిటీ ఏం చేసింది?

ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల నియామకంపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో కమిటీ వేసిన కలెక్టర్, సంబంధిత పత్రాలు, నిర్దిష్ట సిఫారసులతో వివరణాత్మక నివేదికను వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం కార్యదర్శికి నివేదించాలని ఆదేశాలు కూడా జారీ చేశారు. ఈ మేరకు ఇటీవల విచారణ జరిపిన అధికారులు నివేదికలు మాత్రం వెల్లడించలేదు. ఇటు నమస్తే తెలంగాణలో వచ్చిన కథనం వాస్తమా, అబద్ధమా..? అనే వివరణ కూడా ఇవ్వలేదు. అయితే ఓ ప్రభుత్వ ఆమోదిత సంస్థకు చెందిన అధికారి విచారణ కమిటీ ముందు హాజరైనట్లు తెలుస్తోంది. ఈ అధికారి ఇచ్చిన వివరణపైనే కమిటీ తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అయితే ఇప్పటికే మెడికల్ కళాశాలలో కీలకంగా ఉన్న అధికారికి ఈ అధికారికి మధ్య ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పించడంలో సత్సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఇద్దరు అధికారులు ఒక్కటై కమిటీని తప్పుతోవ పట్టించి ఉంటారనే అనుమానాలు కూడా లేక పోలేదు. కొత్తగా వచ్చే ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల కోసం గతంలో సీడ్ గోదాముల్లో పనిచేసిన కార్మికులను కూడా ఈ విధంగానే ప్రలోభాలకు గురి చేసి ఉంటారనే ఆరోపణలు వస్తున్నాయి. న్యాయంగా అయితే గత ప్రభుత్వంలో అధికారులు ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు హమాలీలకు ఔట్ సోర్సింగ్‌లో ఉద్యోగాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది. కానీ ఈ అధికారి జోక్యంపైనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సదరు కార్మికులను ప్రలోభ పెట్టి పెద్ద మొత్తంలో వసూళ్ల పర్వానికి ఈ అధికారి తెర తీసినట్లు కళాశాల ఉద్యోగులు, అధికారులే చర్చించుకుంటున్నారు.



ఇటీవల మెడికల్ కళాశాలకు వచ్చిన గతంలో పనిచేసిన కార్మికులు

## ధాన్యం తరలింపులో

# తప్పెవరిది?





- వానకాలం వడ్లకు అనుమతి తీసుకొని యాసంగి ధాన్యం తరలించిన మిల్లరు
- తెలిసినా వదిలేసిన జిల్లా అధికారులు
- కమిషనరేట్‌కు ఫిర్యాదు వెళ్లడంతో విచారించిన టాస్క్‌ఫోర్స్ అధికారులు

**కరీంనగర్ రాంనగర్‌లోని ఓ రైస్ మిల్లు నుంచి ధాన్యం తరలింపు వ్యవహారం వివాదాస్పదమవుతున్నది. ఒక మిల్లుకు కేటాయించిన ధాన్యాన్ని అనుమతి లేకుండానే మరో మిల్లుకు తరలించడం పెద్ద దుమారమే రేపింది. అది కూడా వానకాలం సీజన్‌లో ఇచ్చిన వడ్లకు పర్మిషన్ తీసుకొని యాసంగి ధాన్యం తరలించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అయితే ధాన్యం తరలింపు గురించి జిల్లా సివిల్ సప్లయ్స్ అధికారులకు ఫిర్యాదు అందడంతో పరిశీలించేందుకు వచ్చిన ఓ అధికారి, ఎలాంటి చర్యలూ తీసుకోకుండానే వెనుదిరిగి వెళ్లారని స్థానికుల ద్వారా తెలుస్తున్నది. ఈ విషయం సివిల్ సప్లయ్స్ కమిషనరేట్‌కు తెలియడంతో సోమవారం టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేసి తరలించిన ధాన్యాన్ని కూడా గుర్తించడంతో జిల్లా అధికారుల తీరు అనేక అనుమానాలకు తావిస్తున్నది.**

కరీంనగర్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): కరీంనగర్‌లోని రాంనగర్‌లో ఉన్న ఓ రైస్ మిల్లుకు సివిల్ సప్లయ్స్ అధికారులు కేటాయించిన ధాన్యాన్ని మరో మిల్లుకు తరలించినట్లు సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు వెళ్లింది. దీంతో సోమవారం రాష్ట్ర స్థాయిలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు మిల్లులో తనిఖీలు చేశారు. కరీంనగర్ రూరల్ మండలం పరిధిలోని నగునూర్‌లో ఉన్న ఈ మిల్లర్‌కు చెందిన మరో రైస్ మిల్లుకు పెద్ద మొత్తంలో ధాన్యాన్ని తరలించినట్లు అధికారులు గుర్తించారు. గత నెల 28, 31 తేదీలతోపాటు ఈ నెల ఒకటిన మూడు రోజుల పాటు ఈ ధాన్యాన్ని తరలిస్తున్న విషయాన్ని గమనించిన స్థానికులు, జిల్లా సివిల్ సప్లయ్స్ అధికారులకు సమాచారం అందించారు. ధాన్యం తరలిస్తుండగానే ఈ మిల్లుకు వచ్చిన ఓ అధికారి పరిశీలించి ఎలాంటి చర్యలు తీసుకోకుండానే వెనుదిరిగి వెళ్లినట్లు తెలుస్తున్నది. జిల్లా అధికారి పట్టించుకోకపోవడంతో స్థానిక యువకుడు ఒకరు సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ కమిషనరేట్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ శాఖ కార్యదర్శి చౌహాన్ ఆదేశాల మేరకు సోమవారం టాస్క్‌ఫోర్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేశారు. ఒక మిల్లుకు ప్రభుత్వం కేటాయించిన ధాన్యాన్ని అధికారుల అనుమతి లేకుండా తరలించినట్లు వెల్లడైంది. నిజానికి ఒక మిల్లు నుంచి మరో మిల్లుకు ధాన్యాన్ని తరలించే పరిస్థితి వస్తే సంబంధిత అదనపు కలెక్టర్ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఈ మిల్లర్ వానకాలం ధాన్యాన్ని తరలించేందుకు అనుమతి తీసుకుని యాసంగి ధాన్యాన్ని నగునూర్‌లోని మరో మిల్లుకు తరలించినట్టు తెలుస్తున్నది.

అయితే ధాన్యం తరలిస్తుండగా మిల్లు వద్దకు వెళ్లిన అధికారికి మాత్రం ఈ విషయం ఎందుకు తెలియలేదనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. రాంనగర్‌లోని మిల్లును సందర్శించినపుడే ఈ విషయాన్ని గుర్తించి అభ్యంతరం తెలిపితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు వెళ్లేది కాదని స్థానికులు అంటున్నారు.

### టాస్క్‌ఫోర్స్ అధికారులు నివేదించేనా..?

కరీంనగర్ జిల్లాలో ధాన్యం కేటాయింపులో అవకతవకలు జరుగుతున్నట్లు ఒక్క మిల్లులో టాస్క్‌ఫోర్స్ తనిఖీ చేస్తేనే వెల్లడైంది. నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలో ఇంకా అనేక మిల్లులకు అధికారులు ధాన్యం కేటాయించారనే ఆరోపణలు వస్తున్నాయి. చాలా మంది మిల్లర్లు ఏకంగా ధాన్యం అమ్ముకొని సకాలంలో సీఎంఆర్‌కు కూడా ఇవ్వడం లేదని తెలుస్తున్నది. టాస్క్‌ఫోర్స్ అధికారులు కూడా ఈ మిల్లులో తనిఖీలు చేసినపుడు వానకాలం ధాన్యాన్ని తరలించేందుకు అనుమతి తీసుకుని యాసంగి ధాన్యాన్ని తరలించారని మాత్రమే గుర్తించినట్టు తెలుస్తున్నది. నిజానికి నిబంధనలకు విరుద్ధంగా రారైస్ మిల్లుకు యాసంగి ధాన్యం ఎలా కేటాయించారనే దానిపై ఎందుకు ఫోకస్ చేయలేదనే ప్రశ్న తెరపైకి వస్తున్నది. రాష్ట్ర అధికారులకు ఫిర్యాదు వెళ్లడంతోనే ఈ విషయం బయటకు వచ్చింది. లేకుంటే కనుమరగయ్యేది. అసలు ధాన్యం తరలిస్తున్నపుడు ప్రత్యక్షంగా చూసిన అధికారి జిల్లా అధికారులకు ఇచ్చిన నివేదికలో ఎలాంటి అంశాలను పొందుపర్చాడనే విషయం ఇపుడు చర్చకు వస్తున్నది. ఇలా అనేక రారైస్ మిల్లులకు యాసంగి ధాన్యం కేటాయించిన అధికారులు మిల్లింగ్ తర్వాత వచ్చే బియ్యం నాణ్యత విషయాన్ని గాలికి వదిలేస్తున్నట్టు తెలుస్తున్నది. టాస్క్‌ఫోర్స్ అధికారులు సరైన నివేదిక ఇవ్వడంతోపాటు అనేక రారైస్ మిల్లులను విస్తృతంగా తనిఖీ చేస్తే జిల్లా అధికారులు చేస్తున్న తప్పులు కుప్పలు తెప్పలుగా వెలుగులోకి వచ్చే అవకాశం కనిపిస్తున్నది.

### యాసంగి ధాన్యం ఎలా కేటాయించారు?

రాంనగర్‌లో ఉన్న రారైస్ మిల్లుకు యాసంగి ధాన్యం కేటాయించడం కూడా వివాదం అవుతున్నది. నిజానికి రారైస్ మిల్లులకు వానకాలం ధాన్యాన్ని మాత్రమే కేటాయిస్తారు. యాసంగి ధాన్యంలో నూక శాతం ఎక్కువ వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో బాయిల్డ్ మిల్లులకు మాత్రమే కేటాయిస్తారు. కానీ, ఈ మిల్లుకు మాత్రం యాసంగిలో 2,750 మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం కేటాయించినట్లు తెలుస్తున్నది. ఈ విషయాన్ని కూడా టాస్క్‌ఫోర్స్ అధికారులు గుర్తించారు. నిజానికి యాసంగి ధాన్యాన్ని సార్టెక్స్ మిషన్లు ఉన్న మిల్లులకే కేటాయించాలని 2017 నుంచి ప్రభుత్వం నిర్ణయించింది. కానీ రాంనగర్‌లోని మిల్లుకు సార్టెక్స్ మిషన్ లేకున్నా ఇంత పెద్ద మొత్తంలో యాసంగి ధాన్యాన్ని జిల్లా అధికారులు ఎందుకు కేటాయించారనే ప్రశ్న తెరపైకి వస్తున్నది. ఇలా సార్టెక్స్ మిషన్ లేకుండా జిల్లా వ్యాప్తంగా అనేక రారైస్ మిల్లులకు యాసంగి ధాన్యాన్ని కేటాయించినట్లు తెలుస్తున్నది. రాంనగర్‌లోని రారైస్ మిల్లులో సార్టెక్స్ మిషన్‌తో పాటు పోషక విలువలు ఉండే ఎఫ్ఆర్‌కే బియ్యాన్ని మిక్స్ చేసే యంత్రం కూడా లేనట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులు గుర్తించారు. ఇలా లోపభూయిష్టంగా ఉన్న మిల్లులకు ధాన్యాన్ని కేటాయించడం నిబంధనలకు విరుద్ధమని తెలిసినా జిల్లా అధికారులు ఎలా కేటాయించారనే ఆరోపణలు వస్తున్నాయి. అయితే రాంనగర్ మిల్లులో ఈ సదుపాయాలు లేకనే సదరు మిల్లరు నగునూర్‌లోని తనకు చెందిన మరో మిల్లుకు తరలించినట్లు తెలుస్తున్నది. అయితే రెండు మిల్లుల పేరిట ధాన్యం తీసుకుని ఒకే మిల్లులో మిల్లింగ్ చేయిస్తున్నారనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. అధికారులకు తెలిసే ఇవన్నీ జరుగుతున్నాయనే విమర్శలున్నాయి.